సాక్షి ఆదిలాబాద్

సోమవారం ׀ 9 ׀ డిసెంబర్ ׀ 2024



అభిరుచి దారిలో...

నిర్మల్ జిల్లాకు చెందిన పలువురు నిర్మాతలు షార్ట్ ఫిలిం, సాంగ్స్ తెరకెక్కిస్తున్నారు. స్థానిక కళాకారులకు అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు. 8లో▸

సీఆర్టీల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ఎదులాపురం: ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల ఐదునెలల వేతనాలు విడుదల చేయాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ ప్రకటనలో డిమాండ్ చేశారు. నెలల తరబడి వేతనాలు అందక కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వారికి కుటుంబ పోషణ భారంగా మారుతుందని తెలిపారు. ఐటీడీఏ పీవో ప్రత్యేక చొరవ చూపి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.0/13.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఆన్‌లైన్ నృత్య పోటీల్లో బాలకేంద్రం చిన్నారులు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ఆదిలాబాద్: ఐసీఎండీఏ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ వేదికగా ఆదివారం నిర్వహించిన రావణ కృత శివతాండవం కూచిపూడి నృత్య పోటీల్లో జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన చిన్నారులు పాల్గొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో 10 ప్రపంచ రికార్డులు సాధించాలనే లక్ష్యంతో ఆన్‌లైన్ వేదికగా ఈ పోటీలను నిర్వహించినట్లు కేంద్రం సూపరింటెండెంట్ మిట్టు రవి తెలిపారు. ఈ పోటీల్లో బాలకేంద్రం నుంచి చెన్న మోక్ష, కానిందే మహాశ్రీ ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు.

కుష్ఠు రహిత సమాజానికి పాటుపడాలి



సర్వే పరిశీలిస్తున్న డీఎల్‌వో గజానంద్

ఆదిలాబాద్‌టౌన్: కుష్ఠు రహిత సమాజానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని జిల్లా కుష్ఠు నివారణ అధికారి గజానంద్ అన్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమంలో భాగంగా ఆశ కార్యకర్తలు ఇంటింటా సర్వే చేపడుతున్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో చేపట్టిన సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుటుంబ సభ్యులంతా తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. 2027 నాటికి కుష్ఠు రహిత దేశంగా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. శరీరంలో పాలిపోయిన రాగిరంగు, మొద్దుబారిన మచ్చలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు రావడం వంటి లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ అధికారి వామన్‌రావు, రమేశ్, సీవోలు ప్రణీత, నవీన్, ఏఎన్‌ఎంలు హరిత, లత, ఆశ కార్యకర్తలు అర్చన, లక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బోథ్ విద్యార్థుల ప్రతిభ



పతకాలను అందుకున్న విద్యార్థులు

బోథ్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బోథ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో మండల కేంద్రంలోని వేదం పాఠశాలకు చెందిన శ్రీనివిత, అలాగే ఎస్‌కె. జోహా, జి.సారిక, హారోహి, సరస్వతి శిశుమందిర్‌కు చెందిన పి.వైష్ణవి స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే సీహెచ్ వాణి, వేదజ, జి.సుమలత, విష్ణువర్దన్, ప్రణవి, బి.హర్షిత, సాన్వి, హరుషా, శ్రీనిధి, రుతిక్ రజత పతకాలు కైవసం చేసుకున్నారు. విజేతలను కరాటే మాస్టర్లు లాడేవార్ రాజు, బి.రమేశ్, అశోక్ అభినందించారు.

'గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్ర'



మాట్లాడుతున్న ఫరీజ్ మొయినొద్దీన్

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేసిన గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని బీఆర్‌ఎస్వీ రాష్ట్రకార్యదర్శి ఫరీజ్ మొయినొద్దీన్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గురుకులాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, విద్యార్థులు మరణిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పేరిట సంబరాలు చేసుకోవడం కాదని, వసతిగృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 48 మంది విద్యార్థులు చనిపోయారని, వారి గురించి పట్టించుకోవడం లేదన్నారు. గురుకులాల బాట ద్వారా సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సమావేశంలో నాయకులు శివకుమార్, ప్రశాంత్, షోయబ్, సలీ మ్, రాజేశ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

లంచం ఇవ్వకండి.. సమాచారం ఇవ్వండి

లంచం.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న అంశాల్లో ఒకటి. తీసుకోవడం ఎంత నేరమో.. ఇవ్వడం అంతకంటే పెద్ద నేరం. జనం అవసరాలను ఆసరాగా చేసుకుని కొంతమంది సర్కారు సేవకులు అత్యాశకు పోతున్నారు. వేలు, లక్షల్లో వేతనాలు వస్తున్నా.. చాలదన్నట్లుగా పక్కచూపులు చూస్తూ ప్రజలను లంచాల కోసం వేధిస్తున్నారు. ఇలాంటి వారి ఆట కట్టించడమే ధ్యేయంగా పనిచేస్తోంది అవినీతి నిరోధక శాఖ. సమాచారం ఇస్తే చాలు వారి భరతం పడతామంటోంది ఏసీబీ. 'అవినీతిని అంతమొందించాలి.. యువత ముందుకు రావాలి' అంటూ ఆ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేడు అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

8 మందిని పట్టించాను..



2011 సంవత్సరంలో మా బంధువుకు సంబంధించిన దస్తావేజుల్లో సవరింపు కోసం రిజిస్ట్రేషన్ అధికారులు రూ. 7వేల లంచం అడిగారు. ఏసీబీని ఆశ్రయించి ముగ్గురు అధికారులను పట్టించాను. 2014లో ఇండస్ట్రీయల్ శాఖలో సబ్సిడీ డబ్బుల కోసం అధికారులు రూ.60 వేల లంచం అడిగారు. ఇద్దరిని పట్టించాను. మా వాటర్‌ప్లాంట్‌ను వేరే చోటికి మార్చగా ట్రాన్స్‌ఫార్మర్ కోసం విద్యుత్ శాఖ అధికారులు రూ.50వేల లంచం అడిగారు. రూ.30వేలు ఇచ్చినా పనిచేయలేదు. దీంతో ముగ్గురిని ఏసీబీకి పట్టించాను. – బండారి సంతోష్, ఆదిలాబాద్

- అవినీతిపరుల ఆటకట్టిస్తామంటున్న ఏసీబీ
- ప్రజా చైతన్యంతోనే సాధ్యమంటున్న అధికారులు
- అక్రమార్కుల భరతం పడుతున్న పలువురు బాధితులు
- నేడు అవినీతి వ్యతిరేక దినోత్సవం



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏసీబీ కార్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ కార్యాలయాల్లో కొంతమంది ఉద్యోగులు లంచావతారం ఎత్తుతున్నారు. అక్రమ సంపాదనకు ఆశపడి ప్రజలను వేధిస్తున్నారు. అయితే కొందరు అమాయకులు తమ పని కాదేమో అనే భయంతో వారు అడిగిన కాడికి ఇచ్చుకోవాల్సి వస్తోంది. విసుగు చెందిన బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ.. లంచావతారులపైన కొరడా ఝుళిపించి కటకటాల పాలు చేస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 12 మంది ఉద్యోగులు, అధికారులు అవినీతి నిరోధక శాఖ వలలో చిక్కడం గమనార్హం.

మారని తీరు..

ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆయా శాఖల్లో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులు, అధికారులు లంచాలకు అలవాటు పడ్డారు. పనికోరేటు చొప్పున వసూళ్లకు పాల్పడుతున్నారు. పారదర్శకంగా సేవలు అందించాల్సి ఉండగా, మామూళ్లు ఇవ్వనిదే పని చేయడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులు, పలుకుబడిన వ్యక్తులు ఎలాగో తమ పనులు చేయించుకుంటుండగా, సామాన్యులు మాత్రం ఎవరికి చెప్పుకోలేక, డబ్బులు ఇవ్వలేక అవస్థలు పడుతున్నారు. మరోవైపు డబ్బులు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ సమయంలో అధికారులు, ఉద్యోగులు బాధపడుతున్నారే తప్పా లంచం లేకుండా ఎలాంటి పనులు మాత్రం కానివ్వడం లేదు. ముఖ్యంగా విద్య, వైద్యం, రెవెన్యూ, మున్సిపల్, రవాణాశాఖ, ట్రెజరీ, రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, జెడ్పీ, అగ్నిమాపక, ఎక్సైజ్, పోలీసు, అగ్రికల్చర్.. ఇలా పలు శాఖల్లో కొంతమంది అవినీతి అధికారులు రాజ్యమేలుతున్నారు. తాజాగా ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం భోరజ్ చెక్‌పోస్టు వద్ద రికార్డులతో సంబంధం లేని రూ.62,500లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రతీసారి తనిఖీలు చేసినప్పుడు ఇక్కడ వేలాది రూపాయలు పట్టుబడుతుండడం గమనార్హం.

ఈ ఏడాదిలో పట్టుబడిన ఘటనలు..

- జనవరి 10న నిర్మల్ జిల్లా కడెం తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు అధికారులు రూ.9వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.
- జనవరి 10న బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏఈ, పంచాయతీ కార్యదర్శి రూ.15వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.



అవినీతి వ్యతిరేక పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా (ఫైల్)

- జనవరి 23న నిర్మల్ జిల్లా మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్, రెవెన్యూ అధికారి రూ.3500 లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- ఏప్రిల్ 15న ఆసిఫాబాద్ ఎస్సై ప్రైవేట్ మెకానిక్ వద్ద రూ.25వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.
- మే 22న భైంసా మున్సిపల్‌కమిషనర్, బిల్ కలెక్టర్ రూ.30వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు.
- మే 9న చెన్నూర్ ఇరిగేషన్ ఏఈ రూ.5వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి అధికారులకు చిక్కాడు.
- మే 27న దహెగాం మండలం ఏవో రూ.38వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.
- నవంబర్ 2న జైనూర్ తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి రూ.12వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- నవంబర్ 13న నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ రూ.15వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు.
- నవంబర్ 29న నిర్మల్ సర్వేల్యాండ్ రికార్డులో పనిచేసే జూనియర్ అసిస్టెంట్, ప్రైవేట్ ఉద్యోగి రూ.10వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- డిసెంబర్ 4న నిర్మల్ మార్కెటింగ్ ఏడీ రూ.7వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.

ఉమ్మడి జిల్లాలో నాలుగేళ్లలో నమోదైన ఏసీబీ కేసుల వివరాలు..

సంవత్సరం	కేసులు
2020	04
2021	05
2022	05
2023	09
2024 (ఇప్పటివరకు)	12

ఈ ఏడాది నలుగురికి జైలు శిక్ష..

- వాంకిడి సీఐగా పనిచేసిన లచ్చన్న 2013లో లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. 2024 జూలైలో ఏసీబీ కోర్టు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.
- ఆదిలాబాద్ జిల్లాలో విద్యుత్ శాఖ ఏడీగా పనిచేసిన రేగుంట స్వామి 2010లో ఏసీబీకి చిక్కాడు. ఇటీవల కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది.
- ఉట్నూర్ ఐటీడీఏలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీధర్ 2009లో ఏసీబీకి పట్టుబడ్డాడు. ఈఏడాది సెప్టెంబర్‌లో న్యాయస్థానం ఏడేళ జైలు శిక్ష విధించింది.
- లక్సెట్టిపేటలో డీటీవోగా పనిచేసిన తొగరి పోచయ్య 2013లో ఏసీబీకి పట్టుబడ్డాడు. ఈ నవంబర్‌లో న్యాయస్థానం ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష విధించింది.

ఏసీబీని ఆశ్రయించడం ఇలా..

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, అధికారులు లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు, డీఎస్పీ నంబర్ 9154388963, సీఐలను 9154388964, 9154388965 నంబర్లలో సంప్రదించవచ్చు. నేరుగా అవినీతి నిరోధక శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అక్రమార్కుల భరతం పడతారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతారు. ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని ఏసీబీ అధికారులు చెబుతున్నారు. సమాచారం అందించిన 24 గంటల్లోనే దాడులు నిర్వహిస్తామని పేర్కొంటున్నారు. అయితే ఆ శాఖ ఉద్యోగిని పట్టిస్తే తమ పని నిలిచిపోతుందని భయపడాల్సిన అవసరం లేదు. ఆ తర్వాత ఇన్‌చార్జి అధికారి ద్వారా ఏసీబీ అధికారులు త్వరగా బాధితుల పనిని దగ్గరుండి చేయిస్తారు. వేధింపులు రాకుండా చూస్తారు. అవినీతి అధికారులను పట్టించే సమయంలో ఇచ్చిన డబ్బులను ప్రభుత్వం రెండు నెలల్లో చెక్ రూపంలో తిరిగి అందజేస్తుంది. పట్టుబడ్డ ఉద్యోగులు 40 నుంచి 50 రోజుల పాటు జైలు జీవితం గడపాల్సి ఉంటుంది. రెండేళ్ల వరకు ఉద్యోగంలో చేరే అవకాశం ఉండదు. ఎనిమిది నుంచి పదేళ్లలో కేసు ట్రయల్‌కు వస్తుంది. దాదాపు 90 శాతం కేసులు రుజువవుతున్నాయి.

లంచానికి ఆశపడితే జీవితం నాశనం



ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు, అధికారులు లంచానికి ఆశపడి జీవితాన్ని దుర్భరం చేసుకోవద్దు. 90 శాతం ఏసీబీ కేసులు రుజువవుతుండగా కారకులు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. అలాగే ఉద్యోగం నుంచి కూడా డిస్మిస్ అవుతారు. బాధితులు తమ పని కోసం ఎవరికి లంచం ఇవాల్సిన అవసరం లేదు. టోల్‌ఫ్రీ, ఏసీబీ కార్యాలయం, అధికారుల ఫోన్‌కు సమాచారం అందిస్తే 24 గంటల్లో దాడులు నిర్వహిస్తాం. అందరు సహకరిస్తేనే అవినీతి రహిత సమాజం ఏర్పడుతుంది. ఏసీబీని ఆశ్రయిస్తే తమ పని అవుతుందో.. కాదనే సందేహంలో ఉండకూడదు. దగ్గరుండి బాధితుల పని చేయిస్తాం. అన్ని కార్యాలయాల్లో ఏసీబీ అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాం. బాధితులు లంచం రూపంలో ఇచ్చిన డబ్బులను రెండు నెలల్లో తిరిగి ఇచ్చేలా చర్యలు చేపడుతాం.
– రమణమూర్తి, ఏసీబీ డీఎస్పీ, కరీంనగర్

పల్లె పోరుకు సన్నద్ధం

- ఏర్పాట్లలో యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తి
- బ్యాలెట్ పేపర్ల ముద్రణకు కసరత్తు
- జిల్లాలో మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు

కైలాస్‌నగర్/బోథ్: గ్రామ పంచాయతీ ఎన్నికలకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. వచ్చే ఏడాది జనవరిలో నోటిఫికేషన్ వెలువడవచ్చనే సంకేతాలతో ఏర్పాట్లపై దృష్టి సారించింది. ప్రభుత్వం ఎప్పుడు ఆదేశించినా నిర్వహించేందుకు వీలుగా అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. గ్రామాలు, వార్డుల వారీగా ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేయగా తాజాగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ సైతం పూర్తి చేశారు. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ పేపర్ల ముద్రణకు కసరత్తు చేస్తున్నారు. అయితే రిజర్వేషన్ల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కులాల వారీగా గణన చేపట్టడంతో వాటిపై ఉత్కంఠ నెలకొంది. సర్పంచ్ పదవీకి సై అంటున్న అభ్యర్థులు ఇప్పటికే ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

ముమ్మర ఏర్పాట్లు

పల్లె సమరానికి అవసరమైన ఓటర్ల జాబితాను ఇప్పటికే సిద్ధం చేసిన అధికారులు తాజాగా పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. 200 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ లెక్కన 200 వరకు ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలు 3,525గా గుర్తించారు. అలాగే 201 నుంచి 400 వరకు ఓటర్లు ఉన్న కేంద్రాలు 281 కాగా, 451 నుంచి 650 వరకు ఓటర్లు ఉన్న కేంద్రాలు 46గా గుర్తించారు. ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీలోని ప్రతి వార్డులో ఓటర్ల సంఖ్య 651దాటింది. ఇక్కడ 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే దానిపై అధికారులు దృష్టి సారించారు. అలాగే బ్యాలెట్ బాక్స్‌లను సైతం సిద్ధం చేసే దిశగా చర్యలకు ఉపక్రమించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న బాక్స్‌లన్నింటినీ జిల్లా కేంద్రానికి తెప్పించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాంలో వాటిని నిల్వ చేసి మరమ్మతులు చేపడుతున్నారు. ఎన్నికల్లో కీలకమైన బ్యాలెట్ పేపర్ల ముద్రణ కసరత్తు సైతం ప్రారంభించారు. పంచాయతీల్లోని ఓటర్ల సంఖ్య, పోటీచేసే అభ్యర్థుల సంఖ్యకనుగుణంగా వీటిని ముద్రించనున్నారు. బ్యాలెట్ పేపర్లను పంచాయతీ అధికారులే అందించనుండగా గుర్తులను మాత్రం ప్రింటింగ్ ప్రెస్‌ల్లో ముద్రించనున్నారు. జిల్లాలోని ప్రింటింగ్‌ప్రెస్‌ల వివరాలను అధికారులు ఇప్పటికే సేకరించారు. సోమ లేదా మంగళవారాల్లో వాటిని ఖరారు చేయనున్నారు. బరిలో ఇద్దరు, ముగ్గురు, నలుగురు, ఐదుగురు, పది మంది అభ్యర్థులు పోటీ చేసినట్లయితే తదనుగుణంగా నోటా గుర్తుతో కలిపి వాటి ముద్రణ చేపట్టనున్నారు.



పోలింగ్‌కేంద్రాల జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు..

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్న ఆశావహులు ఇప్పటికే ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రతిరోజు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నారు. అలాగే కాలనీల్లో తిరుగుతూ ప్రతి ఒక్కరిని పలకరిస్తున్నారు. కులాల వారీగా తమ బలాన్ని అంచనా వేసుకుంటున్నారు. యువతను ఆకర్షించేందుకు మందు, విందులను ఏర్పాటు చేస్తున్నారు. ఏ కార్యక్రమమైనా వాలిపోతున్నారు. ప్రజలకు చేరువయ్యేందుకు యత్నిస్తున్నారు.

జిల్లాలో..

పంచాయతీలు	473
వార్డులు	3,872
ఓటర్లు	4,47,135
గుర్తించిన పోలింగ్ కేంద్రాలు	3,888
సిద్ధంగా ఉన్న బ్యాలెట్ బాక్స్‌లు	7,200

మండలం	పంచాయతీలు	వార్డులు
మొదటి విడతలో..		
ఆదిలాబాద్‌రూరల్	34	280
మావల	03	28
బేల	37	286
జైనథ్	42	342
తాంసి	14	112
భీంపూర్	26	196
రెండో విడతలో ..		
బోథ్	33	278
బజార్‌హత్నూర్	31	244
నేరడిగొండ	32	252
గుడిహత్నూర్	26	208
తలమడుగు	29	238
మూడో విడతలో...		
ఇంద్రవెల్లి	28	236
ఉట్నూర్	38	354
నార్నూర్	23	198
గాదిగూడ	25	196
సిరికొండ	19	148
ఇచ్చోడ	33	276

పోలింగ్ సిబ్బంది వివరాల సేకరణ

జిల్లాలో పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. మొదటి విడతలో 156 పంచాయతీలు 1,244వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండో విడతలో 151 పంచాయతీలు 1,220 వార్డులు, మూడో విడతలో 166 పంచాయతీల్లోని 1408 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. వీటి నిర్వహణకు గాను పోలింగ్ సిబ్బంది ఎంత మంది అవసరమనే దిశగా అంచనా వేసిన అధికారులు వారి వివరాలు సేకరిస్తున్నారు. ఈ సమాచారాన్ని అంతా వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు.

రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ

అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తుంటే రిజర్వేషన్లపై మాత్రం ఇంకా ఉత్కంఠ వీడటం లేదు. బీసీ రిజర్వేషన్లు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ముగిసి డేటా ఎంట్రీ ప్రక్రియ కూడా పూర్తయింది. ప్రభుత్వం రిజర్వేషన్లను కొత్తగా ఖరారు చేయనుండటంతో అవి మారే అవకాశం ఉంది. దీంతో ఆశావహులకు టెన్షన్ పట్టుకుంది. ఈ నెలాఖరు లేదా జనవరి మొదటి వారంలో ఈ ఉత్కంఠకు తెరపడే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



రోడ్డుపై సహపంక్తి భోజనం చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

సమగ్ర ఉద్యోగుల నిరసన

- రోడ్డుపైనే సహపంక్తి భోజనం

ఆదిలాబాద్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా రోజుకో వినూత్న కార్యక్రమం చేపడుతున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో రోడ్డుపై ఉద్యోగులు సహపంక్తి భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్ మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 10 నుంచి విద్యా శాఖను స్తంభింపజేస్తామన్నారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్, మండల విద్యాధికారి, జిల్లా విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు విధుల బహిష్కరణ చేపడతారని పేర్కొన్నారు. వీరికి పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పార్థసారథి, భోజన్న, దేవదర్శన్, ప్రకాశ్, సలీమ్, సోమన్న, చిరంజీవి, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సైన్స్‌ఫేర్ సర్టిఫికెట్లు, మెమెంటోలు మాయం

- హడావుడిగా మరోసారి ప్రింటింగ్
- కలెక్టర్, డీఈవో సంతకాలు లేకుండానే అందజేత

ఆదిలాబాద్‌టౌన్: సైన్స్‌ఫేర్‌కు సంబంధించి విద్యార్థులకు అందజేసే మెమెంటోలు, సర్టిఫికెట్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో అధికారులు అయోమయానికి గురయ్యారు. బహుమతులు అందజేసే సమయంలో ఇవి కనబడకుండా పోవడంతో అవాక్కయ్యారు. మళ్లీ ప్రింటింగ్‌ప్రెస్‌కు వెళ్లి హడావుడిగా ముద్రించి విద్యార్థులకు అందజేయాల్సి వచ్చింది. సరిపడా మెమెంటోలు లేకపోవడంతో ప్రదానం చేసిన వాటి నే మిగతా వారికి అందజేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ క్రమంలో కొందరు ఉపాధ్యాయులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. జరిగిన వి షయం చెప్పడంతో మిన్నకుండిపోయారు. అయితే కావాలనే కొంత మంది వీటిని ఎత్తుకెళ్లారనే చర్చ అక్కడ సాగింది. జిల్లాకేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో రెండు రోజుల పాటు జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ మేళా నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం తర్వాత ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలతోపాటు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. వీటికి సంబంధించి విద్యాశాఖ అధికారులు ముందుగానే సర్టిఫికెట్లను సిద్ధంగా ఉంచారు. వీటిపై కలెక్టర్, విద్యాశాఖఅధికారి, సైన్స్ అధికారి సంతకం చేయించి విద్యార్థులకు అందజేస్తారు. బహుమతులకు సంబంధించి ఇద్దరు టీచర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. ఆ ఉపాధ్యాయులు వాటిని కంప్యూటర్ గదిలో ఉంచి భోజనానికి వెళ్లారు. తిరిగివచ్చేసరికి అక్కడ కొన్ని మెమెంటోలు,సర్టిఫికెట్లు మాయమయ్యాయి. అయితే ఆ పాఠశాలలో సీసీ కెమెరాలున్నాయి. వీటిని పరి శీలించేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఈ సర్టిఫికెట్లను ఎవరు ఎత్తుకెళ్లారో తెలియనుంది.

క్లుప్తంగా

తొలి వేతనం.. అనాథలకు..!



విరాళం అందిస్తున్న ఉపాధ్యాయుడు

భైంసాటౌన్(ముధోల్): తనకు ప్రభుత్వ ఉద్యోగం రావడంతో వచ్చిన తొలివేతనాన్ని అనాథల కోసం విరాళంగా అందించి ఆదర్శంగా నిలిచాడు కోతుల్‌గాంకు చెందిన శేఖర్. ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం రావడంతో తన మొదటి వేతనం రూ. 26,053 ఆదివారం తన తల్లిదండ్రులతో కలిసి పట్టణంలోని వివేకానంద అనాథ పిల్లల ఆవాసానికి విరాళంగా అందజేశాడు. కార్యక్రమంలో సాదుల కృష్ణదాస్, ఆవాసం ప్రముఖ్ లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక



సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఉమ్మడి జిల్లా ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్‌లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సయ్యద్ ఆజం అలీ, కార్యదర్శిగా పి.రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కే.రాజేశ్వర్, జె.స్వామి, సంయుక్త కార్యదర్శులుగా షేక్ ఒసామా, కె.మాధవ్, అస్మ సుల్తానా, ట్రెజరర్‌గా ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, పబ్లిసిటీ సెక్రెటరీగా ఎస్.శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వి.మనోజ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఎన్.ప్రకాష్, ఎండీ రషీద్, రైస ఖాతూన్, అడ్వైజర్‌గా అన్నెల ఆడెల్లు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ వ్యవహరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్‌కుమార్, రాష్ట్ర నాయకులు తిర్మల్ రెడ్డి, తాలూకా కార్యదర్శి అరుణ్ కుమార్, ఉమ్మడి జిల్లా ఉద్యోగులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

బాసర: బాసరలోని ఓ లాడ్జిలో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన రాజేందర్ (25) ఆదివారం లాడ్జీలో ఉరేసుకున్నాడు. కిటికీ లోంచి గమనించిన లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులోపడి గొర్రెల కాపరి మృతి

భైంసారూరల్: ప్రమాదవశాత్తు చెరువులోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని దేగాం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గణేశ్ (35) గొర్రెలు మేపేందుకు సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. ఒక గొర్రె నీటిలో మునిగిపోవడం గమనించి దానిని కాపాడబోయి నీట మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చెరుకుని మృతదేహాన్ని భైంసా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

అభిరుచి దారిలో... ఉపాధి బాటలో..



నిర్మల్‌ఖిల్లా: జీవన మనుగడ కోసం ఏదైనా ఉపాధి ఉండాల్సిందే.. అయితే అందరూ ఆలోచించే రీతిలో వెళ్తే ప్రత్యేకత ఏముంటుందని భావించిన జిల్లాకు చెందిన యువత ఇందుకు భిన్నంగా ఆలోచించి తమకు అభిరుచి కలిగిన రంగంలో ప్రయత్నించి సఫలం అవుతున్నారు. అభిరుచి ఉంటే చాలు ఏ రంగంలోనైనా ప్రణాళికాబద్ధంగా శ్రమిస్తే కచ్చితంగా విజయానికి చేరువ అవుతామంటున్నారు. ప్రస్తుతం వినోద రంగానికి ప్రాధాన్యత ఉంది. వినోదాన్ని మించిన కాలక్షేపం మరేది లేదు. నిర్మల్ జిల్లాలో కవులు, రచయితలు, కళాకారులు, లొకేషన్లకూ కొదువలేదు. దీంతో జిల్లాలో షార్ట్ ఫిలిమ్స్, సాంగ్స్, చిన్న సినిమాల షూటింగ్స్ విరివిగా కొనసాగుతున్నాయి. అయితే వీటిని నిర్మాణ రంగంలో ఆర్థిక వనరుల పాత్ర కూడా కీలకమే. పెట్టిన పెట్టుబడి రాబట్టాలన్నా మంచి కంటెంట్‌తో కూడిన షార్ట్ ఫిలిమ్స్ సాంగ్స్ సినిమాలు రావాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే జిల్లాకు చెందిన అభిరుచి కలిగిన నిర్మాతలు షార్ట్ ఫిలిం, సాంగ్స్ తెరకెక్కిస్తూ మరింత మందిని ప్రోత్సహిస్తున్నారు. స్థానిక కళాకారులకు అవకాశాలు కల్పిస్తూ ఉపాధిని పెంపొందించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై 'సాక్షి' కథనం...

- షార్ట్ ఫిలిమ్స్, సాంగ్స్ నిర్మాణంలో ముందుకు..
- స్థానిక కళాకారులకు అవకాశం
- యూట్యూబ్ చానల్ ద్వారా ఆశించిన ఆదాయం
- ముందుకు సాగుతున్న స్థానిక దర్శక నిర్మాతలు



సారంగపూర్ మండలంలో గ్రామీణ నేపథ్యంలో సాగుతున్న షూటింగ్



నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన శెట్టిపల్లి కమలాకర్, గర్దాసు నరేందర్ ఇద్దరు మిత్రులు. మొదటి నుంచి ఒకే రకమైన అభిరుచి కలిగి ఉన్నారు. ఇక్కడి పరిస్థితులు, పరిసరాలు వారికి కొట్టినపిండి. తమ ఆసక్తి మేరకు జిల్లాలో అనువైన ప్రాంతాలు, మంచి కంటెంట్ ఎంచుకుని సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్ నిర్మిస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రత్యేక గీతాలు, సామాజిక సందేశాత్మక పాటలు, యువత ఎక్కువగా ఆశించే అంశాలపై చిత్రాలు, సాంగ్స్ తీస్తున్నారు. దర్శకులు, రచయితలు, నటీనటులను స్థానికంగానే ఎంపిక చేసి వారికి అవకాశాలు కల్పిస్తున్నారు.

అదే వారి ప్రపంచం...

చిత్రీకరణ అంటేనే అనేక కళల సమ్మిళితం. షార్ట్ ఫిలిమ్స్, సాంగ్స్ వంటివి అనుకున్న రీతిలో తీయడం ఒక ఎత్తు అయితే వాటిని వీక్షకుల వద్దకు చేర్చడం మరో ఎత్తుగా మారింది. అలా మంచి వ్యాపారాత్మక స్ట్రాటజీతో వెళ్తేనే వీక్షకులకు చేరువవుతామని దర్శక నిర్మాతలు పేర్కొంటున్నారు. ఉమ్మడి అభిరుచి కలిగి లక్ష్యం దిశగా సాగాలన్న ఏకాభిప్రాయంతోనే జిల్లాకు చెందిన దర్శక నిర్మాతలు ముందుకు సాగే క్రమంలో 'తెలుగు సినిమా ప్రపంచం' అనే యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడిప్పుడే కళాకారుడిగా పేరు సంపాదించిన రచయిత, దర్శకుడు మను మనోహర్‌తో పాటు ప్రొడక్షన్ రంగంలో సాగుతున్న శెట్‌పల్లి కమలాకర్, గర్దాసు నరేందర్ ఉమ్మడిగా యూట్యూబ్ ఛానల్ ప్రారంభించి ప్రస్తుతం రాష్ట్రంలో మంచి పేరు సాధించిన మరో 14 ఇతర ఛానల్స్‌తో సమష్టిగా ఏర్పడ్డారు. లఘు చిత్రాలను నిర్మిస్తూ వాటిని తమ యూట్యూబ్ ఛానల్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. వీటిలో కొన్ని 60 లక్షల వరకు వ్యూస్ వచ్చినట్లు చెబుతున్నారు. దీంతో తాము పెట్టిన పెట్టుబడితో పాటు తగిన లాభాలు కూడా ఉంటున్నాయని చెబుతున్నారు. ఇప్పటి వరకు దాదాపు 600 మంది కళాకారులకు అవకాశం కల్పిస్తూ.. 200కు పైగా పాటలు, 3 వెబ్ సిరీస్‌లతో పాటు, 42 షార్ట్ ఫిలిమ్స్ నిర్మించి విడుదల చేసినట్లు పేర్కొన్నారు.





దర్శక నిర్మాతలతో స్థానిక వర్తమాన కళాకారులు, నటీనటులు

కొనసాగుతున్న షూటింగులు..

తాజాగా సారంగాపూర్ మండలంలోని బోరిగాం, ధని, రామన్న తండా తదితర ప్రాంతాల్లో షూటింగ్‌లు కొనసాగుతున్నాయి. ఇక్కడి కళాకారులు, టెక్నీషియన్లతోనే తమస్థాయి బడ్జెట్లో షార్ట్ ఫిలింలు తీసి యూట్యూబ్ వేదికగా వీక్షకులకు అందుబాటులో ఉంచుతున్నారు. దీనికి తోడు విడుదల చేసిన చిత్రాలు, పాటలకు కూడా వీక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు.

వీక్షకుల ప్రోత్సాహంతోనే..



జిల్లాలో షార్ట్ ఫిలిమ్స్, స్పెషల్ సాంగ్స్ చిత్రీకరణ చేసేందుకు మంచి లొకేషన్లు అందుబాటులో ఉన్నాయి. స్థానిక కళాకారులు, టెక్నీషియన్లతో తక్కువ బడ్జెట్‌లోనే లఘు చిత్రాలు తెరకెక్కిస్తున్నాం. ఇప్పటివరకు 200 పైగా పాటలు రాశా. నా దర్శకత్వంలో అనేక షార్ట్ ఫిలిమ్స్ విడుదలయ్యాయి. యూట్యూబ్ మాధ్యమంలో వీక్షకుల నుంచి మంచి ప్రోత్సాహం లభిస్తోంది. ఆదాయం కూడా గణనీయంగా ఉంటుండడంతో వినోద రంగంలో ముందుకెళ్తున్నాం.

– మను మనోహర్, రచయిత, దర్శకుడు, నటుడు, నిర్మల్

ప్రేక్షకాదరణ పొందిన కొన్ని లఘుచిత్రాలు, సాంగ్స్

- కాళ్లకేమో పారాణి – అందాల యువరాణి
- బరువెక్కిపోయెనమ్మా ఈ గుండె...
- తెలియదే అమ్మ ఉన్నప్పుడు...
- అందాల అంతఃపురంలో..
- నీలమ్మా..నీలమ్మా...

బాలికను చెరబట్టిన కామాంధుడు

- ఇంటి ముందు ఆడుకుంటుండగా ఇంట్లోకి తీసుకెళ్లి అఘాయిత్యం
- ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చిన చిన్నారి..
- విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

లక్ష్మణచాంద(నిర్మల్): ఇంటిముందు ఆడుకుంటున్న ఓ చిన్నారిపై కన్నేసిన కామాంధుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (8) శనివారం స్కూల్‌కు వెళ్లలేదు. తల్లిదండ్రులు పనికి వెళ్లడంతో ఇంటిముందు ఆడుకుంటోంది. బాలిక ఇంటికి సమీపంలో ఉండే కూరగాయల వ్యాపారి బొమ్మరేని సాగర్ (36) చిన్నారికి మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. అనంతరం బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లింది. సాయంత్రం తల్లిదండ్రులు వచ్చాక విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నిందితుడు పాత నేరస్తుడే..

గతంలో గేదెల కాపరిగా పనిచేసిన సాగర్‌కు నేర చరిత్ర ఉంది. మరో వ్యక్తితో కలిసి విద్యుత్ షాక్‌తో చేపలు పట్టేవాడు. ఓ వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన కేసులో జైలుశిక్ష అనుభవించాడు. ఏడాది క్రితం విడుదలయ్యాడు. ఆటోలో గ్రామాలకు వెళ్లి కూరగాయలు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాడు. అతనికి భార్య, ఐదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మూడేళ్లుగా సహజీవనం.. ఆపై హత్య



సంఘటన స్థలంలో మృతదేహం

మంచిర్యాలక్రైం: మూడేళ్లుగా ఓ మహిళతో సహజీవనం చేసి ఆపై హత్య చేసిన ఘటన జిల్లా కేంద్రంలోని రెడ్డి కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం రెడ్డికాలనీకి చెందిన తీగల భాగ్యలక్ష్మి (45)తో అదే కాలనీకి చెందిన మిట్టపల్లి వీరస్వామి మూడేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. వీరస్వామి భార్య, భాగ్యలక్ష్మి భర్త చనిపోవడంతో ఇద్దరూ కలిసి ఉంటున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో మద్యం సేవించి తరచూ గొడవపడేవారు. ఆదివారం సాయంత్రం వీరస్వామి మద్యం సేవించి భాగ్యలక్ష్మితో గొడవకు దిగాడు. మాటామాట పెరగడంతో బండరాయితో తలపై బాదడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

వరిధాన్యం అపహరణ

- రాత్రిపూట ఎత్తుకెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తులు



తిర్పెల్లి వద్ద ధాన్యం దొంగిలించిన దృశ్యం

లక్ష్మణచాంద: ఆరుగాలం చెమటోడ్చి రైతులు పండించిన వరి ధాన్యాన్ని పలు గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోతున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని రాత్రి సమయాల్లో ఎత్తుకు పోతున్నారు. దీంతో చేసిన కష్టం దొంగల పాలవుతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు

- రెండు రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన కూన పోశెట్టి రోడ్డుపై వరిధాన్యం ఆరబెట్టి తూకం వేయడానికి సంచుల్లో నింపి ఉంచాడు. అందులో నుంచి 12 సంచులు (40 కేజీలు) రాత్రి సమయంలో ఎత్తుకెళ్లారు.
- అదేరోజు మండల కేంద్రానికి చెందిన కొట్టాల ముత్యం తినడానికి ఆరబెట్టిన వరి ధాన్యం నుంచి 7 సంచులు (70 కేజీలు) ఎత్తుకెళ్లారు.
- ఇటీవల పొట్టపెల్లి(కే) గ్రామానికి చెందిన భూమారెడ్డి అనే రైతుకు చెందిన రెండు సంచులు, మరో రైతుకు చెందిన ఒక సంచి ఎత్తుకెళ్లారు.
- ఆదివారం రాత్రి తిర్పెల్లికి చెందిన ధర్మరాజు వరి ధాన్యం రాశి నుంచి కొంత ఎత్తుకెళ్లినట్లు రైతు వాపోయాడు. దీనిపై ఎస్సై సుమలతను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని, మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాలను కూడా పరిశీలిస్తున్నామన్నారు.

నమ్మినవారే ఇంటికి కన్నం వేశారు

- 12 మంది అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీసీపీ ఎగ్గడి భాస్కర్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: నమ్మినవారే ఇంటికి కన్నం వేసిన సంఘటన మంచిర్యాలలో చోటు చేసుకుంది. పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలోని విజయ నర్సింగ్‌హోం వైద్యుడు విజయబాబు ఇంట్లో గత నెల 30న జరిగిన చోరీ కేసులో 12 మందిని అరెస్టు చేయగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు డీసీపీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన వైద్యుడు విజయబాబు రోజు వారీగా ఆస్పత్రిలో వచ్చిన డబ్బులు లెక్కచేయకుండానే బెడ్‌రూంలోని లాకర్‌లో భద్రపరిచేవారు. వారి ఇంట్లో పనిచేస్తున్న రాజేశ్వరి, వనిత కుటుంబ సభ్యులతో నమ్మకంగా ఉండేవారు. లాకర్‌లో డబ్బులు, నగలు దాచిపెట్టడం గమనించిన సదరు మహిళలు ఎలాగైనా వాటిని కాజేయాలని నిర్ణయించుకున్నారు. అదును కోసం ఎదురుచూస్తుండగా సదరు వైద్యుడు ఇంటికి సంబంధించిన తాళంచెవి పోగొట్టుకుంటారు. దీంతో రాజేశ్వరి, వనితను తీసుకెళ్లి మార్కెట్‌లో కొత్త తాళంచెవి చేయించాడు. ఆసమయంలోనే సదరు మహిళలు డూప్లికేట్ తాళంచెవి చేయించారు. విషయాన్ని రాజేశ్వరి సోదరుడైన దుర్గం తిరుపతికి చెప్పి చోరీకి పథకం వేశారు. గత నెల 30న స్థానిక నార్త్ ఇన్ హోటల్‌లో డాక్టర్ విజయబాబు పుట్టిన రోజు వేడుకలకు సదరు మహిళలు కూడా వెళ్లారు. ఇదే అదునుగా భావించిన రాజేశ్వరి తమ సోదరుడు తిరుపతికి విషయం చేరవేసింది. తిరుపతితో పాటు మరి కొంతమంది స్నేహితులను వెంటబెట్టుకొని విజయబాబు ఇంట్లోకి చొరబడి లాకర్‌ను ఎత్తుకెళ్లారు.

చెట్ల పొదల్లో లాకర్ దాచి...

ఎత్తుకెళ్లిన లాకర్‌ను బెల్లంపల్లిలో చెట్లపొదల్లో దాచి ఉంచారు. ఆతర్వాత మంచిర్యాలకు వచ్చి ఓ ఆటోను తీసుకెళ్లి లాకర్‌ను ఆటోలో మంచిర్యాలలోని రాళ్లపేటలోని ఎండీ నీజీర్ ఇంట్లో స్టోన్ కట్టర్‌తో కట్ చేసి అందులో ఉన్న రూ.15.50 లక్షల నగదు, 44 తులాల బంగారు ఆభరణాలు వాటాలుగా పంచుకున్నారు. వైద్యుడి ఫిర్యాదుతో పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి సీసీ పుటేజీల ఆధారంగా మంచిర్యాల ఇస్లామ్‌పురకు చెందిన దుర్గం తిరుపతి, దుర్గం రాజేశ్వరి, నజీమ్ బాబ, ఎండీ తాజీమ్, గౌతమి నగర్‌కు చెందిన బామన్ కాన్ గణేశ్ సుధాకర్, స్వప్న, రాళ్లపేటకు చెందిన ఎండీ నాజిల్, నస్రీన్, ఎండీ నసీర్, రాంనగర్‌కు చెందిన ఎస్‌కే అల్తాఫ్, సయ్యద్ సోహెల్, రాజీవ్ నగర్‌కు చెందిన ఎండీ. అమన్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వనిత, స్వప్న, నజియ పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.15.50 లక్షల నగదు, 35 తులాల బంగారు ఆభరణాలతో పాటు చోరీకి ఉపయోగించిన ఆటో, మూడు బైక్‌లు, స్టోన్ కట్టర్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. చోరీ కేసులో ప్రత్యేక చొరవ చూపిన ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు, సీసీఎస్ సీఐ కమలాకర్, ఎస్సై సనత్‌రెడ్డి, సీసీఎస్ ఎస్సై నరేష్ సిబ్బందిని సీపీ శ్రీనివాసులు, డీసీపీ భాస్కర్ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు



మాట్లాడుతున్న జైనథ్ సీఐ సాయినాథ్

బేల: ఈ నెల 4న బేలలోని శ్రీకర్ మార్ట్‌లో జరిగిన చోరీ కేసులో ఎనిమిది మంది అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీ పుటేజీల ఆధారంగా నిందితులు మధ్యప్రదేశ్‌కు చెందిన ముఠాగా గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. బేల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో పట్టుకుని విచారించగా ఆదిలాబాద్‌లోని మావల ఏరియాలో చిన్న చిన్న గుడిసెలు వేసుకుని శ్రీకర్ మార్ట్‌లో రూ.5.87 లక్షలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. చోరీకి పాల్పడిన వారిలో రాజనాసి రాథోడ్, అభిషేక్‌సింగ్ రాథోడ్, షారుక్, తాహిర్, రుషితో పాటు ఇద్దరు మహిళలు బిజిలాబాయి, హీరబాయి, ఒక బాలుడు ఉన్నారన్నారు. వారి వద్ద నుంచి రూ.2.41 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని, మిగతా డబ్బులు మధ్యప్రదేశ్‌కు చెందిన అప్సాన వద్ద ఉన్నట్లు తేలిందన్నారు. సమావేశంలో సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, బేల ఎస్సై దివ్యభారతి, ఏఎస్సై కనక జీవన్, సీసీఎస్ సిబ్బంది రుక్మారెడ్డి, జాకీర్, జోగేందర్ సింగ్, నరేష్, శ్రీనివాస్, రహత్, బేల సిబ్బంది సలీం, ప్రభాకర్ పాల్గొన్నారు.

'బొచ్చ' @ 16 కిలోలు



చిన్నారుల చేతిలో పెద్ద చేప

నెన్నెల: మండలంలోని నందులపల్లి తిమ్మయ్య చెరువులో ఆదివారం బోరింగ్ పోశం అనే మత్స్యకారుడి వలకు 16 కిలోల చేప చిక్కింది. ముక్కలుగా కోసి విక్రయించగా రూ.4 వేలు వచ్చినట్లు చెప్పాడు. ఈ చేపను స్థానికులు ఆసక్తిగా వీక్షించారు.

30 వసంతాల కలయిక



ఉట్నూర్‌రూరల్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993-94 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. నాటి గురువులు రాజారెడ్డి, నారాయణ, ఆనందీశ్వర్, మహేశ్, రమేశ్, వీరయ్య, భాస్కర్, చంద్రయ్య, గంగామణిని శాలువాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థులు ఆదిల్ షేక్, ఉస్కమొల్ల సాంబన్న, రాజనర్సయ్య, దేవిదాస్, రాజలింగు, విలాస్, చిన్నయ్యను అభినందించారు.